Eenadu Dt 11/05/18

# వస్తూ.. వస్తూ.. కొనేయొచ్చు..



- మెట్రో స్టేషన్లలో 'మన కూరగాయలు' దుకాణాలు
- ప్రస్తుతానికి 11 చోట్ల.. తర్వాత అన్నింటా అమ్మకాలు

ఈనాడు, హైదరాబాద్

దుకాణం మన ఇంటికి వెళ్లే దారిలో ఉంటే.. కూరగాయలు కొనుక్కొని ఇంటికి వెళ్లడానికి ఎంత అనువుగా ఉంటుందో చెప్పక్కర్లేదు. అలా కాకుండా.. ప్రత్యేకంగా వెళ్లడమంటే ఇబ్బందిగానే భావిస్తాం. అందుకే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణ ప్రాంగణాల్లో కూరగాయలను అందుబాటులోకి తీసుకువస్తోంది. పెద్ద మార్కెట్లలా కాకుండా.. చిన్న ఔట్‌లెట్‌లుగా వీటిని ఏర్పాటు చేసి.. నాణ్యమైన సరకును అమ్మేందుకు చర్యలు చేపడుతోంది. ముందుగా మెట్రో రైల్వే స్టేషన్లలో 'మన కూరగాయలు' దుకాణాల ఏర్పాటుకి రంగం సిద్ధం చేసింది.

## నెలరోజులు.. 11 స్టేషన్లలో..

మార్కెటింగ్ శాఖ నగరవ్యాప్తంగా ఇప్పటివరకూ 50 మన కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసింది. సూపర్ మార్కెట్లతో పోటీ పడి తాజా కూరగాయలను తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతోంది. తాజాగా మియాపూర్ మెట్రో స్టేషన్లో మొదటి స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. మియాపూర్ నుంచి ప్యారడైజ్ వరకూ ఉన్న 15 స్టేషన్లలో 11 చోట్ల నెల .రోజుల్లో నెలకొల్పనున్నారు. మెట్రో రైలు ప్రయాణికులే కాకుండా.. ఆ దారిన ఇతరులూ ఆగి కొనుక్కునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మెట్రో ప్రయాణికుల సంఖ్య నిత్యం 70 వేలకు మించి ఉంది.. అన్ని కారిడార్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. దాదాపు 4 లక్షల మంది ప్రయాణికులుంటారని అంచనాలున్నాయి. వ్యాపారానికి ఇంతకంటే కావాల్సిన వనరు ఏముంటుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ భావిస్తోంది.



### స్టేషన్ కిందనే..

ఇప్పటికే మెట్రో అధికారులతో చర్చలు జరిపిన మార్కెటింగ్ శాఖ. 'మన కూరగాయలు'ను మెట్రో స్టేషన్ల కిందే ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రయాణికులతో పాటు.. ఆ మార్గాన వెళ్లే ఇతర వాహనదారులు, పాదచారులు కొనుక్కునేందుకు వీలుగా దుకాణాలు ఉంటాయి. వీటితో పాటు.. జీహెచ్ఎంసీ పరిధిలోని బస్టాపుల్లోనూ ఈ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## అక్టోబరు నాటికి అన్ని స్టేషన్లలో..

ప్రస్తుతం రైతుబజారుకంటే.. కిలో ఒకటి, రెండు రూపాయలు ఎక్కువ ధరకు మన కూరగాయలను అమ్ముతున్నారు. త్వరలో రైతు బజార్లతో సమానంగా అవే ధరలకు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. అక్టోబరు నాటికి ప్రస్తుతం ఉన్న అన్ని మెట్రో స్టేషన్లలో ఈ దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు.